క్లుప్తంగా

హోలీని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

టేకుమట్ల: నేడు(సోమవారం) నిర్వహించుకునే హోలీ పండుగను మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై గోగికారి ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హోలీ అనంతరం స్నానానికి వాగులు, చెరువులు, ఊట బావుల్లో వెళ్లకుండా నేరుగా ఇంటికి వెళ్లాలని సూచించారు. చెరువుల్లో, బావుల్లో ప్రమాదవశాత్తు నీట మునిగితే కుటుంబం తీవ్రవేదనకు గురైతుందని, కావున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గీత కార్మికుడికి గాయాలు



టేకుమట్ల: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఏరుకొండ రామస్వామి అనే గీతా కార్మికుడు రోజు వారిలాగే వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి పడి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు చికిత్స కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరికి గాయాలు

కాటారం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని ధన్వాడ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని పోచమ్మకు గ్రామానికి చెందిన చీటూరి నీరజ, లక్ష్మి మొక్కులు చెల్లించుకొని నడుచుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఇద్దరికి ఇద్దరికి గాయాలైయ్యాయి.

పొక్లెయినర్ సీజ్



శాయంపేట: మండలంలోని వసంతాపూర్ గ్రామశివారు పెద్దమ్మ కుంటలో అక్రమంగా మట్టిని తోడుతున్న ప్రొక్లెయినర్‌ను ఆదివారం సీజ్ చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. మైనింగ్, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు లేకుండా మట్టిని తోడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు నివేదించినట్లు ఆయన పేర్కొన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

పరకాల: రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న టెట్ ఫీజును తగ్గించాలని పరకాల మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు ముఫీనా పాతిమా హమీద్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం పెంచిన ఫీజు నిరుత్సాహానికి గురిచేసిందన్నారు. తక్షణమే ప్రభుత్వం చొరవ చూపి టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా విజయ



పరకాల: మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మండలంలోని నాగారం గ్రా మానికి చెందిన వార్డు సభ్యురాలు పసుల వి జయను ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా మహిళా అ ధ్యక్షురాలు కంక సరళాదేవి, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్న ఆమె తన నియామకానికి కృషిచేసిన జిల్లా, మండల, పట్టణ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

నర్సంపేట : ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో సింగతి మల్లికార్జున్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పార్టీ డివిజన్ కమిటీ సమావేశంలో రమేశ్ మాట్లాడారు. పాలక పార్టీలు అధికారం దక్కించుకోవడానికి అనేక హామీలు గుప్పించి గద్దెనెక్కి ఆచరణలో విస్మరిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కి మతోన్మాదంతో కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు మోసపూరిత విధానాలతో వస్తోందని ధ్వజమెత్తారు.

ముసలమ్మవాగులో అడ్డుకట్టల తొలగింపు



అడ్డుకట్టలను తొలగిస్తున్న గ్రామస్తులు

మంగపేట: ముసలమ్మవాగు నీటికి వేసిన అడ్డుకట్టలను రాజుపేట గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు ఆదివారం తొలగించారు. మండలంలోని తిమ్మపురం అటవీ ప్రాంతం నుంచి ములమ్మ వాగు రామచంద్రునిపేట, రాజుపేట మీదుగా నిత్యం జీవనదిలా పారుతోంది. ఈ వాగులో రాజుపేట గ్రామానికి తాగునీటి సరఫరా చేసేందుకు మెస్ పాయింట్(బోరుబావి) నిర్మించారు. పూర్వం నుంచి వాగు నీటిపై ఆధారపడి వివిధ గ్రామాల రైతులు పంట పొలాలకు మళ్లించుకుని సాగునీటికి వినియోగించుకుంటు పండించుకుంటున్నారు. అదే విధంగా రాజుపేటతో పాటు రామచంద్రునిపేట, కొత్తూరుకాలనీ, వాగొడ్డుగూడెం, కత్తిగూడెం, దేవనగరం గ్రామాలకు సైతం వాగులో మెస్ పాయింట్ల ద్వారా తాగునీటి సరఫరా అవుతుంది. వేసవి కాలంలో వాగునీటికి అడ్డుకట్టలు వేయడంతో వాగులో నీరు లేక ఎండి పోవడంతో మెస్ పాయింట్లలో నీరు లేక ఆయా గ్రామాలకు ప్రతిఏటా తాగునీటి సమస్య ఏర్పడుతోంది. ప్రస్తుతం రాజుపేటలో 10 రోజుల నుంచి తాగునీటి సమస్య ఏర్పడటంతో గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది గ్రామస్తులు ఆదివారం తిమ్మాపురం వద్ద వాగు నీటికి వేసిన అడ్డుకట్టలను తొలగించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక ఫ్రీ



మాట్లాడుతున్న చిటమట రఘు

ఏటూరునాగారం: ఇందిరమ్మ ఇళ్లను పేదలు నిర్మించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని వాగులు, ఇసుక నిల్వల నుంచి ఉచితంగా రవాణా చేసుకునే అవకాశాన్ని కల్పించడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు ఇళ్లు నిర్మించుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారని పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వంను గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయూబ్, ఖలీల్, లాలయ్య, బాలరాజు, నర్సింహరావు, ఎల్లయ్య, గౌస్, రియాజ్, శ్రీనివాస్, రవి, సత్యం, నవీన్, ముస్తాఫా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లైట్లు, ఫ్యాన్లు, డస్ట్‌బిన్ల బహూకరణ



సూపరింటెండెంట్‌కు అందజేస్తున్న అధికారులు

కాళేశ్వరం: పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్‌టీపీసీ సంస్థ సీఎస్‌ఆర్ నిధులు రూ.4లక్షలతో కాళేశ్వరాలయం భక్తుల సౌకర్యార్థం 50 ఎల్‌ఈడీ ఫ్లడ్ లైట్లు, 50ఫ్యాన్లు, 50 డస్ట్ బిన్‌లను ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు ఆదివారం అందజేశారు. దీంతో వారిని శ్రీకాళేశ్వరముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో అభిషేకము చేయించి, శ్రీ పార్వతి అమ్మవారి ఆలయంలో వేద పండితులు, అర్చక స్వాములు స్వామివారి శేష వస్త్రములు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఎన్‌టీపీసీ సంస్థ నుంచి బహూకరించినందుకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, యాజమాన్యానికి దేవస్థానం తరఫున ఆలయ సూపరింటెండెంట్ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసంస్థ డిజీఎం(హెచ్‌ఆర్) ఎస్.ప్రశాంత్, ఆదేశ్ పాండే, రవి సభావత్ , వేముగంటి యుగేందర్ రావు, ఆరెల్లి సత్యనారాయణ గౌడ్ , అంబట్‌పల్లి మాజీ సర్పంచ్ విలాస్‌రావు, మహదేవపూర్ మండలం ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి



కాంగ్రెస్‌లో చేరిన వారితో సత్యనారాయణరావు

శాయంపేట: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మండలంలోని కాట్రపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల ద్వారా పేదలకు మేలు జరుగుతుందన్నారు. మాజీ ఎంపీటీసీ తరాల సౌందర్య రాజమౌళి, మాజీ వార్డు సభ్యులు తరాల పెద్దమొగిలి, నాయకులు భిక్షపతి, వీరన్న, ఆరె స్వామి, రాజు తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు వాంకుడోతు జగన్, నర్సయ్య పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించే వరకూ పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

దామెర: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకూ అలుపెరగని పోరాటం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళి అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీరణ తుదిదశకు చేరుకుందని అన్నారు. మందకృష్ణ ఆధ్వర్యంలో మాదిగలకు రిజర్వేషన్ ఫలాలు త్వరలో అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు గజ్జి ప్రదీప్, రవికుమార్, ఈసంపల్లి రాజు, వడ్డెపల్లి సైలాస్ బాబు, గజ్జి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గజ్జి మధుకర్, అధికార ప్రతినిధిగా చిలువేరు సూర్యకిరణ్, ఉపాధ్యక్షుడిగా వడ్డెపల్లి సాగర్, ప్రధాన కార్యదర్శులుగా గజ్జి ప్రదీప్, వడ్డెపల్లి రాజేష్, కార్యదర్శులుగా గోవిందు విజయ్‌కుమార్, చిలువేరు ప్రవీణ్, సహాయ కార్యదర్శిగా వడ్డెపల్లి రఘుపతి, బొౖర రాజశేఖర్, ప్రచార కార్యదర్శిగా వడ్డెపల్లి పవన్‌లను ఎన్నుకున్నారు.

కోటంచలో ప్రత్యేక పూజలు

- హనుమంత వాహనసేవలో లక్ష్మీనరసింహస్వామి



హనుమంత వాహనంపై స్వామి వారి ఊరేగింపు

రేగొండ: మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి హనుమంత వాహనసేవలో స్వామి వారిని మాడ వీధుల గుండా ఊరేగించారు. ఉదయం నిత్య విధి పూజలు, హోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బలిహరణం అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారికి దోపోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అరగింపు, తీర్థప్రసాద వితరణ చేశారు.

జాతరలో పోలీస్ బందోబస్తు..

కోటంచలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ తరుపున భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. ఆదివారం జాతరలో పోలీస్ బందోబస్తు గురించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్, చిట్యాల సీఐ మల్లేష్, ఎస్సైలు ప్రసాద్, సాంబమూర్తి, శ్రీలత, శ్రావణ్, అశోక్, కమిటీ సభ్యులు మల్లెబోయిన శ్రీధర్, మూల ఓంకార్, దోబిలి కోటేశ్వర్‌రావు, కనుకుంట్ల జోగేందర్, పేరాల తిరుపతి, పోలుసాని శ్రీనివాసరావు, లింగంపల్లి తిరుపతిరావు, గ్రామ పెద్దలు కనుకుంట్ల దేవేందర్, ఆలయ సిబ్బంది రవీందర్ పాల్గొన్నారు.

నేటి నుంచి జాతర ప్రారంభం

కోటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం హోలీ పండుగ సందర్భంగా హోమ, బలిహరణములు మధ్యాహ్నం మహాపూర్ణాహుతి, సాయంత్రం బోనములు తిరుగుటతో జాతర ప్రారంభమవుతుంది. సాయంత్రం పెద్ద రథోత్సవం, ఎడ్లబండ్లు, ప్రభబండ్లు, ఇతర వాహనాలు తిరుగు కార్యక్రమాలు ఉంటాయని అర్చకులు తెలిపారు.

తస్లీమాను ఉద్యోగం నుంచి తొలగించాలి

మంగపేట: లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమాను ఉద్యోగం నుంచి తొలగించాలని మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గొప్ప వీరయ్య ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2020లో తస్లీమా ములుగు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న క్రమంలో ఆమె అవినీతిని అక్రమాలను సంఘం ఆధ్వర్యంలో పత్రికల ద్వారా ప్రశ్నించామన్నారు. దీంతో మండలంలోని ఆమె అభిమాన సంఘాలు, కొందరు దళిత సంఘాల నాయకులు తమసంఘాన్ని వెంటనే తస్లీమాకు క్షమాపణ చెప్పాలని గగ్గొలు పెట్టారని పేర్కొన్నారు. మండంలోని 75 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని తస్లీమా తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి లక్షల కోట్ల రూపాయలను లంచం రూపంలో ప్రజల రక్తాన్ని జలగలా పీల్చిందని ఆమెను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

మంగపేట: ఏసీబీ అధికారులకు పట్టుబడిన మహబూబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా కేసు విషయంలో మంత్రి సీతక్కపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తస్లీమా అవినీతి కేసు నిజనిజాలు ఎంటో ముందు ముందు తెలుస్తాయని అంతే కాని కొందరు అవివేకులు సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని ఆరోపణలు చేయడాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఎదుగుదలను ఓర్చుకోలేని ప్రతిపక్ష పార్టీల నాయకులు సీతక్కకు ఆపాదించడం హాస్యాస్పదమన్నారు.

ఘనంగా మట్టల పండుగ

శాయంపేట: మండల కేంద్రంలో ఆదివారం సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు ఘనంగా మట్టల పండుగను నిర్వహించారు. ప్రధానవీధుల గుండా క్రైస్తవ భక్తిగీతాలను ఆలపిస్తూ ఊరేగారు. క్రీస్తు జెరూసలేము పట్టణంలో ప్రవేశించిన దినాన్ని పురస్కరించుకుని మట్టల పండుగను నిర్వహిస్తున్నట్లు ఫాస్టర్ డి.అనిల్‌కుమార్ తెలిపారు. క్రైస్తవ పెద్దలు ప్రవళిక, పాల్, బాబు ఉన్నారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలోని సీఎస్ఐ పరితోమా దేవాలయంలో మట్టల ఆదివారాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే క్రైస్తవులు ఆలయానికి తరలివచ్చారు. యేసు సిలువతో ఈత మట్టలను చేతపట్టుకుని భక్తి గీతలు ఆలపిస్తూ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో రెవరెండ్ ఈపీ.ప్రసాద్ దైవసందేశం వినిపించారు. తొలుత సండే స్కూల్ చిన్నారులు యేసు క్రీస్తు పుట్టు పూర్వోత్తరాలు తెలిపేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక ప్రార్థనలో పాస్ట్రేట్ సెక్రెటరీ నాగెల్లి ప్రకాశ్, పరికి రత్నం, ఈదునూరి బుచ్చయ్య, కల్లెపల్లి రఘువరణ్, పాడేటి ప్రకాశం, త్యాగరాజు, సంయుక్త, మనుగొండ శ్రీలత, భాగ్య, సువర్ణ, ప్రతిభ, పావని తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు: మండల పరిధిలోని ఆరుగుంట పల్లి వద్ద వాజేడు, భద్రాచలం రహదారిపై ఆదివారం వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలను చేపట్టారు. సాయంత్రం సమయంలో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలతో పాటు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనదారుల బ్యాగులను సోదాలు చేశారు. మావోయిస్టుల బంద్ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిఘాను పెంచి ఈ తనిఖీలను సాగించారు.

మంగపేట: మావోయిస్టుల బంద్ సందర్భంగా ఆదివారం మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో పోలుసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బంద్ ప్రభావం మండలంలో ఎక్కడ కూడా కనిపించలేదు. మండలంలో వ్యాపార వాణిజ్య సంస్థలు, పెట్రోల్ బంక్‌లో లావాదేవీలు యథావిధిగా కొనసాగాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, రాకపోకలు ఎలాంటి మార్పు కనిపించలేదు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చిట్యాల: మండలంలోని జడల్‌పేట గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2001–02 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటాపాటలతో సరదగా గడిపారు. ఉపాధ్యాయులు బుచ్చయ్య, సమ్మిరెడ్డి, నర్సయ్య, రవీందర్, నర్సింహాస్వామి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు తంగళ్లపల్లి రాజు అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. రైతు రుణవిమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్, హైదరాబాద్ సివిల్ కోర్టు జడ్జి చిలుకమారి పంచాక్షరీ, చిట్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేష్, టేకుమట్ల ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి, పీఏసీఎస్ చైర్మన్ నరసింగరావు, మాజీ సర్పంచ్‌లు చదువు అన్నారెడ్డి, ధర్మారావు, అరవింద్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, రాములు, చంద్రమౌళి, నాయకులు పున్నం చందర్‌రావు, రాజు, రమేష్, రఫీ, పలు మండలాల పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయడమే లక్ష్యం

నర్సంపేట : గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయడమే లక్ష్యంగా లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోఅబాకస్, చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ శోభారాణి తెలిపారు. పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అబాకస్, చెస్ పోటీలకు ముఖ్యఅతిథులుగా గోక రామస్వామి, విజ్‌డమ్ పాఠశాల డైరెక్టర్ జావెద్ హాజరై మాట్లాడారు. నానాటికీ శారీరక శ్రమ, ఆటల పట్ల పిల్లల్లో ఉత్సాహం సన్నగిల్లుతోందని ఆందోళన వెలిబుచ్చారు. తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవాన్ని పెంపొందించేలా కృషి చేయాలని కోరారు. చెస్ పోటీల్లో అర్బాజ్, తౌసిఫ్ అలీ, ప్రణవ్య, అర్మాన్‌షా, అబాకస్ పోటీల్లో అశ్విత, వర్షిత, మనస్విని, దేవాన్ష, వరునిక, సాయితన్వి, సరయు, అల్వినా కుల్సం, అదీనా జైనబ్, సాయి ఆద్య గెలుపొందగా ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చెస్ క్రీడాకారులు ప్రకాశ్, ప్రవీణ్, సాధినేని సుధాకర్, డాక్టర్ విశ్వనాథ్ నాయక్ పాల్గొన్నారు.

'చర్య తీసుకోవాలి'

టేకుమట్ల: మండలంలోని రాఘవాపూర్ శివారులోని భూమిని విక్రయించిన వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయకుండా కోర్టు జడ్జిమెంట్‌ను సైతం దిక్కరిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌వీసీ సంస్థ మేనేజర్ చల్ల జితేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2017లో రాఘవాపూర్ శివారులోని సర్వే నంబర్ 445లో గల 7ఎకరాల 35 గుంటల గుట్ట భూమిని రాఘవాపూర్ గ్రామానికి చెందిన కర్క రమణారెడ్డి నుండి ఎస్‌వీసీ సంస్థ కొనుగోలు చేసిందని అన్నారు. అట్టి భూమిని రిజిస్ట్రేషన్ కోసం రైతు కర్క రమణారెడ్డిని కోరగా అదనపు డబ్బులు కావాలని కంపెనీ యాజమాన్యాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, గతంలో అదనపు నగదును ఇచ్చినా మరిన్ని డబ్బులు కావాలని కోరగా కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. స్పందించిన కోర్టు 2021 సెప్టెంబర్ 8న ఎస్‌వీసీ సంస్థకు రైతు రిజిస్ట్రేషన్ చేయాలని జడ్జిమెంట్ ఇచ్చినా ఇప్పటి వరకు భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కావున కోర్టు జడ్జిమెంట్‌ను దిక్కరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాని అధికారులను కోరారు.

క్షయ వ్యాధి నివారణకు కృషి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మహదేవపూర్: క్షయ వ్యాధిని నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామారావు అన్నారు. మండలంలోని సూరారం గ్రామంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమారావు మాట్లాడుతూ.. వారం రోజులకు మించి దగ్గు, ఆకలి మందగించడం, రోజురోజుకు బరువు తగ్గడం, రోజు రాత్రి జ్వరం రావడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే భయపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ఉచితంగా 6 నెలల వరకు మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆరు నెలలు వరకు నెలకు రూ.500 చొప్పున పారితోషికం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, మురళిధర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ మషుక్‌అలీ, సత్యనారాయణ, నిర్మల మేరి, కనకదుర్గ, శైలజ, శ్రీదేవి, సారక్క, శారద పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు



గుడుంబాతో నిందితుడు

గోవిందరావుపేట: గుడుంబా తయారు చేసిన, విక్రయించిన చర్యలు తప్పవని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండలంలోని రాంనగర్ గ్రామంలో అక్రమంగా తయారు చేసి విక్రయిస్తున్న గుడుంబా స్థావరాలపై ఆదివారం ఎస్సై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లడుతూ.. గుడుంబా తయారు చేసి విక్రియిస్తున్నారనే అనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో రాంనగర్ గ్రామానికి చెందిన భూక్య అమర్ సింగ్ నుంచి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా గుడుంబా తయారు చేసిన విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.